క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం పున్నమి విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో 11 కేవీ శంకర మఠం విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా రెండు గంటలు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు హేమాద్రి చలపతిరావు, వీధి, జొన్నవిత్తులవారి వీధి, శంకర మఠం, పార్థసారథి వీధి, గురుకృప రోడ్డు, సంజయ్ గాంధీ కాలనీ, ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్, ఆర్కే స్కూల్ రోడ్, టీవీ కృష్ణారావు వీధుల్లో విద్యుత్ ఉండదు.

• భవానీపురం పరిధిలోని 11 కేవీ మసీదు ఫీడర్ కరెంట్ లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు అల్లుడుపేట, బ్యాంక్ సెంటర్, సుధాకర్ మెడికల్ షాప్ రోడ్, రాజేంద్ర వీధి, నాగార్జున వీధి, మసీదు రోడ్, రంగూన్ సాహెబ్ వీధి, కరకట్ట, ఆలివ్ హోటల్ వెనుక వైపు, రీజనల్ సైన్స్ సెంటర్ ఏరియా, కోళ్లఫారం రోడ్, మానవ మందిరం రోడ్, అమృత అపార్ట్‌మెంట్ రోడ్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదు.

ఒలింపియాడ్‌లో నారాయణ విద్యార్థుల ప్రతిభ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జాతీయ ఒలింపియాడ్ పరీక్షల్లో నారాయణ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మంగళవారం భవానీపురంలోని నారాయణ హైస్కూల్‌లో విద్యార్థుల అభినందన సభ జరిగింది. ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి ఒలింపియాడ్ పరీక్షలు జోసా, ఎన్‌టీఈఎక్స్, ఆర్ఓఎం, ఐఎస్ఎండీ, ఐఎస్ఎస్ఓ పరీక్షల్లో నారాయణ స్కూల్ విద్యార్థులు రాంచరణ్, నీలేష్ , రేవంత్, గ్రీష్మ, కృష్ణ, అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. వీరిని ఏజీఎం మురళీ కిషోర్, ఆర్ఐ రామారావు, ప్రిన్సిపాల్ వెంకట సతీష్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



మధురానగర్(విజయవాడసెంట్రల్): భక్తులు, దాతల సహకారంతో ముత్యాలంపాడు సాయిబాబా మందిరాన్ని ఆంధ్ర షిర్డీగా తీర్చిదిద్దామని మందిర గౌరవాధ్యక్షులు పూనూరు గౌతంరెడ్డి అన్నారు. ముత్యాలంపాడు బాబా మందిరంలో మంగళవారం నిత్యాన్నదానానికి దాత ముప్పా ఇంద్రకీల గిరీష్, వీరవెంకట శ్రావ్య రూ.లక్ష విరాళాన్ని గౌతంరెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో మందిర కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్, కోశాధికారి సత్యశ్రీహరి, ముప్పా శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భార్యను వేధిస్తుండటం, అడ్డువచ్చిన బావమరిదిపై దాడి చేసిన భర్తపై వివాహిత ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. కొత్తపేట వడ్డెర కల్యాణ మండపం ప్రాంతానికి చెందిన కొరదల సురేఖ, మణికంఠ భార్యభర్తలు. మణికంఠ ఆటోనడుపుతుంటాడు. సురేఖ ఇంటి వద్ద మిషన్ కుడుతుంది. కొంత కాలంగా మణికంఠ భార్యను వేధిస్తున్నాడు. దీంతో సురేఖ పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ నెల 27న మందుల షాపు కోసం కిందకు రాగా మణికంఠ రోడ్డుపై కనిపించి భార్యను దూషించాడు. ఇంటికి వెళ్లిన సురేఖ ఈ విషయాన్ని అన్నయ్య నాగేంద్రబాబు తెలపగా బావకు ఫోన్ చేసి ఎందుకు తిడుతున్నావని అడిగాడు. దీంత అత్త గారి ఇంటికి వచ్చిన మణికంఠ పక్కనే ఉన్న గాజు సీసాతో బావమరిది నాగేంద్రబాబుపై దాడి చేసి గాయపరిచాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆలోచనలకు పదును పెట్టాలి



పాఠశాల విద్యార్థులకు బహుమతులను అందిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఇగ్నో ప్రాంతీయ సంచాలకురాలు సుమలత



వన్‌టౌన్ కూరపాటి హైస్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శన

జాతీయ సైన్స్ దినోత్సవంలో కలెక్టర్ ఢిల్లీరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు ఆలోచనలకు పదును పెట్టి కొత్త ఆవిష్కరణలు చేయాలని కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. కేబీఎన్ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ సైన్స్ డే వేడుకలు నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు సైన్స్ నమూనాల పోటీలను నిర్వహించి ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తి పెంపొందించాలన్నారు. రామన్ ఆవిష్కరణలతో అణునిర్మాణం, అణువుల ప్రకంపనలు అణుధర్మాలను అధ్యయనం చేయవచ్చునన్నారు. ఆవిష్కరణలతో మానవ వికాసం సాధ్యమవుతుందన్నారు. భౌతిక శాస్త్ర అధ్యాపకులు ఉపద్రష్ట లక్ష్మణసూరి మాట్లాడుతూ ప్రపంచంలో నూతన సాంకేతిక రంగాలు అద్భుత ప్రగతిని సాధిస్తున్నాయన్నారు. కళాశాల కార్యదర్శి తూనుకుంట్ల శ్రీనివాసు మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతికి పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు అధ్యక్షత వహించగా పాలక వర్గ అధ్యక్షులు టి.శేషయ్య, కోశాధికారి అన్నం రామకృష్ణారావు, అధ్యాపకులు డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ భాగ్యకుమార్, శైలజ, కేపీటీ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు. తొలుత పర్యావరణ పరిరక్షణ, భారతీయ శాస్త్రవేత్తల సేవలపై ప్రదర్శించిన ఏకాంకికలు ఆకట్టుకున్నాయి.

ఎంఎస్ఆర్ హైస్కూల్‌లో..

కొత్తపేట మద్ది సుబ్బారావు హైస్కూల్‌లో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఇగ్నో విజయవాడ ప్రాంతీయ కేంద్రం సంచాలకులు డాక్టర్ సుమలత, సహాయ సంచాలకులు డాక్టర్ ప్రసాద్‌బాబు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎగ్జిబిషన్‌ను పరిశీలించి విద్యార్థులు అభినందించారు. ప్రసాదబాబు రచించిన ఆలోచనలకు పదును పెట్టాలని పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి అమరసుధీర్, ప్రధానోపాధ్యాయిని శ్యామల తదితరులు పాల్గొన్నారు.

కూరపాటి హైస్కూల్‌లో...

కూరపాటి హైస్కూల్లో సైన్స్ ఎగ్జిబిషన్‌ను వన్‌టౌన్ సీఐ రావి సురేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు గానుగుల యుగంధరాచార్య నిర్వహించారు.

సైన్స్‌తోనే మానవ మనుగడ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సైన్స్‌తోనే మానవ మనుగడ ముడిపడి ఉందని వక్తలు అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని కేటీ రోడ్డులోని సెయింట్ థామస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు వ్యక్తిత్వం, వ్యాసరచనలపై పోటీలు నిర్వహించారు. స్కూల్ ప్రిన్సిపాల్ రాజుడేవిడ్ దొంతులూరి అధ్యక్షత వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ బషీర్ అహ్మద్, రచయిత రామిరెడ్డి, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు నళిని, వ్యక్తిత్వ వికాస నిపుణురాలు శ్రీప్రియ, శోభారాణి, రమేష్, లక్ష్మీ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విజేతలకు సర్టిఫికెట్లతో పాటు పుస్తకాలను బహుమతులుగా అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని సైన్స్ రిసోర్స్ పర్సన్ ఆర్ వెంకటేశ్వర్లు అన్నారు. అమరావతి బాలోత్సవ్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యాధరపురం లేబర్‌కాలనీలోనిజీఎస్ఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు, సైన్స్‌పై వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అమరావతి బాలోత్సవ్ ప్రధాన కార్యదర్శి రామిశెట్టి కొండలరావు సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభించారు. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభలో ముఖ్యఅతిథులుగా సైన్స్ రిసోర్స్ పర్సన్ ఆర్.వెంకటేశ్వర్లు, జేవీవీ రాష్ట్ర కోశాధికారి శ్రీనివాస్ శాస్త్రవేత్త సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం రవికుమార్, సైన్స్ టీచర్లు జ్యోతి తల్లి, లక్ష్మీనారాయణ, బాలోత్సవ్ సహాయ కార్యదర్శి రవీంద్ర, బాధ్యులు ఏవీ రామరాజు, పీ ఐజాక్ న్యూటన్, నరసింహారావు, స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ రజని, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మైలవరపు దుర్గారావు పాల్గొన్నారు.



సైన్స్ ఎగ్జిబిషన్ తిలకిస్తున్న వెంకటేశ్వర్లు, శ్రీనివాస్



ప్రతిభ చూపిన విద్యార్థులతో అతిథులు

దుర్గమ్మ భక్తులకు మరిన్ని వసతులు



మంత్రి సత్యనారాయణకు ప్రసాదాలు అందజేస్తున్న చైర్మన్ రాంబాబు, సభ్యులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం అండగా ఉంటుందని దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ చెప్పారు. దేవదాయ మంత్రి సత్యనారాయణను నగరంలోని ఆయన నివాసంలో దుర్గగుడి చైర్మన్, పాలక మండలి సభ్యులు మంగళవారం కలిశారు. తొలుత మంత్రికి చైర్మన్ రాంబాబు పుష్పగుచ్ఛం, అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేయగా, శాలువా కప్పి పాలక మండలి సభ్యులు సత్కరించారు. సోమవారం దేవస్థాన పాలక మండలి తొలి సమావేశంలో తీసుకున్న పలు నిర్ణయాలను, పలు అంశాలను చైర్మన్ కర్నాటి రాంబాబు మంత్రికి వివరించారు. మంత్రిని కలిసిన వారిలో పాలక మండలి సభ్యులు కట్టా సత్తెయ్య, బుద్దా రాంబాబు, మంగళగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థాన ట్రస్ట్ బోర్డు సభ్యులు మల్లెల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాడిచర్ల జీవితం యువతకు ఆదర్శం



సమావేశంలో మాట్లాడుతున్న పౌరసంబంధాల శాఖ సంయుక్త సంచాలకుడు కిరణ్

పటమట(విజయవాడతూర్పు): గ్రంథాలయాలు, వయోజన విద్యాకేంద్రాలు స్థాపించి సమాజాభివృద్ధికి కృషి చేసిన గాడిచర్ల హరి సర్వోత్తమరావు జీవితం నేటి యువతకు ఆదర్శమని రాష్ట్ర సమాచార శాఖ సంయుక్త సంచాలకులు పి. కిరణ్ అన్నారు. ఆంధ్రాతిలక్‌గా పేరొందిన గాడిచర్ల హరి సర్వోత్తమరావు 63వ వర్ధంతి మంగళవారం సర్వోత్తమ భవన్‌లో జరిగింది. ఆయన మాట్లాడుతూ వందేమాతరం, ఆంధ్రోద్యమం తదితర ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారని వివరించారు.

గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షులు కె.చంద్రశేఖర్ కల్కూరా ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సాహితీవేత్త కొప్పర్తి రాంబాబు, ఏపీ గాంధీ స్మారక నిధి కార్యదర్శి వై. రామచంద్రరావు, శారద కళాసమితి అధ్యక్షులు డొకిపర్తి శంకరరావు, సాహితీవేత్త గుమ్మా సాంబశివరావు, ఏపీ గ్రంథాలయ సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావి శారద, తదితరులు పాల్గొన్నారు.

అనధికార నిర్మాణం కూల్చివేత



అనధికార ఫ్లోర్‌ను తొలగిస్తున్న వీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది

పటమట(విజయవాడతూర్పు): వీఎంసీ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా నిర్మిస్తే కూల్చేస్తామని వీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ జీవీఎస్‌వీ ప్రసాద్ మంగళవారం హెచ్చరించారు. సత్యనారాయణపురం శ్రీనగర్ కాలనీలోని 5వ లైనులోని, డోర్ నం 21–10/5–15/2లో జీప్లస్‌త్రీకి మాత్రమే అనుమతి పొంది నిర్మాణం మొదలు పెట్టారని తెలిపారు. ప్లాన్ కంటే అదనంగా మరో ఫ్లోర్ నిర్మిస్తుండటంతో వీఎంసీకి ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు. వీనిపై క్షేత్రస్థాయిలో పరిశీలన తర్వాత అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలాజీ పర్యవేక్షణలో, స్థానిక బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ సారథ్యంలో వార్డు ప్లానింగ్ సెక్రటరీలు, అక్రమ నిర్మూలన దళంతో అదనపు అంతస్తు కూల్చివేశామని తెలిపారు. కొంత మంది బిల్డర్లు మార్టిగేజ్ విడుదల కాకుండానే భవనాల్లో ప్లాట్ల అమ్మకాలు చేపట్టారని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో వీఎంసీ నుంచి మార్టిగేజ్ విడుదలైనట్లు ధ్రువీకరణ ఉంటేనే ప్లాట్ల కొనుగోలు చేయాలని వివరించారు. నగర వాసులు భవన నిర్మాణ పనులకు ప్లాను అనుమతి పొందాలని, బ్యాంకులోన్లు రావాలన్నా ప్లానుకు, భవన నిర్మాణ అనుమతి పొందాలని సూచించారు.

భవానీపురంలో అభివృద్ధి పనుల పరిశీలన



గుప్తా సెంటర్‌లో రైతుబజార్ భవన నాణ్యతను పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం , భవానీపురం ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం ఇంజినీరింగ్ అధికారులతో క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. సర్కిల్–1 పరిధిలోని 41వ డివిజన్‌లో ముస్లిం బరియల్ గ్రౌండ్ చుట్టూ నిర్మించిన ప్రహరీ, 39వ డివిజన్ పరిధిలోని గుప్తా సెంటర్‌లో నిర్మించిన రైతుబజార్ భవనాన్ని, 46వ డివిజన్ కేఎల్‌రావునగర్‌లోని దోబీఖానాను పరిశీలించారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు ఉంటేనే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తామని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నారాయణమూర్తి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, ఏఈ రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ నృత్య వైభవం.. గిరిజా కల్యాణం..



సిద్ధార్థ కళావేదికపై రమణీయం.. గిరిజా కల్యాణం..

విజయవాడ కల్చరల్: ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం(సిద్ధార్థ అకాడమీ సాంస్కృతిక సంస్థ) నెల వారీ కార్యక్రమంలో భాగంగా మొగల్రాజపురంలోని సిద్ధార్థ కళాశాలలోని వేదికపై మంగళవారం నాట్యాచారిణి డాక్టర్ వనజా ఉదయ్ బృందం ప్రదర్శించిన గిరిజా కల్యాణం నృత్య రూపకం శాస్త్రీయ నృత్య వైభవాన్ని చాటింది. సతీ వియోగంతో పరమేశ్వరుడు తపస్సు చేయడం, ఆయనకు సపర్యలు చేయడానికి గిరిజను.. హిమవంతుడు నియమించడం తదితర అంశాలతో నృత్య రూపకం సాగుతుంది. నృత్య దర్శకత్వం భాగవతుల సేతురామన్, గిరిజా దేవిగా డాక్టర్ వనజా ఉదయ్, పరమశివునిగా డాక్టర్ విజయపాల్, మన్మథుడిగా చక్రవర్తి, రతీదేవిగా ఐశ్వర్య నర్తించారు. నట్టువాంగం ఆచార్య భాగవతుల సేతురామన్, గాత్రం కన్నారావు, శారదా రెడ్డి, మృదంగంతో ఎస్. నాగేశ్వరరావు సహకరించారు. కార్యక్రమంలో కళాపీఠం అధ్యక్షుడు లక్ష్మణరావు, కార్యదర్శి బీవీఎస్ ప్రకాష్, లలిత్ ప్రసాద్, రమేష్, వెల్లంకి నాగభూషణరావు పాల్గొన్నారు.

దుర్గగుడిలో మనీ సర్క్యులేషన్ స్కీం కలకలం!

లాటరీ, డ్రాల పేరిట డబ్బు వసూలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడిలో మనీ సర్క్యులేషన్ స్కీం కలకలం రేగింది. దేవస్థానంలో ఎన్ఎంఆర్‌గా ఉన్న ఓ ఉద్యోగి కొంత కాలంగా ఆలయంలోని సిబ్బంది, ఎన్ఎంఆర్‌లు, కాంట్రాక్టు సిబ్బందిని స్కీమ్‌లో సభ్యులుగా చేర్పించాడు. ఒక్కొక్కరి నుంచి వారానికి రూ.30 చొప్పున వసూలు చేస్తూ వందలాది మందిని సభ్యులుగా చేర్పించినట్లు తెలుస్తోంది. తొలి వారం రూ.30 , రెండో వారం రూ. 60 చెల్లించేలా స్కీమ్‌ను 30 వారాల పాటు నిర్వహిస్తున్నాడు. వారం వారం లక్కీ డ్రాలో ఒక్కొక్కరికి 20 గ్రాముల వెండి కుంకుమ భరిణ, కుక్కర్ ఇలా అనేక వస్తువులు ఇస్తున్నట్లు , స్కీమ్ చివరి వరకు ఉన్న వారికి భారీ బహుమతుల పేరిట ప్రచారం చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారం మంగళవారం ఆలయంలో చర్చనీయాంశంగా మారింది. గతంలో ఇటువంటి స్కీమ్ ఏమైనా నిర్వహించారా.. సభ్యులందరికీ డబ్బులు చెల్లించారా, లేదా ఏదైనా ఇబ్బంది ఎదురైందా అనే దిశగా దర్యాప్తు జరుగుతోంది. మరో వైపున స్కీంలను ఆలయంలో నిర్వహించడం పద్ధతి కాదని అధికారులు, పోలీసులు పేర్కొంటున్నారు.

మంచినీటి పైప్‌లైన్ల పనులు ప్రారంభం

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక 45వ డివిజన్ కొండ ప్రాంతంలో రూ.49 లక్షల వ్యయ అంచనాతో ఏర్పాటు చేయనున్న మంచినీటి పైప్‌లైన్ల పనులను డివిజన్ బాధ్యులు మైలవరపు కృష్ణ మంగళవారం రమణ బడ్డీ కొట్టు సెంటర్‌లో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో కొండ ప్రాంతవాసులు తాగు నీటికి ఇబ్బందులు పడకూడదని పనులను చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నేతలు ముత్యాల రాంబాబు, బైపినేని కోటేశ్వరరావు, బోర మల్లేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉల్లంఘనులకు జరిమానా

భవానీపురం(విజయవాడపశ్చిమ): సర్కిల్–1 కార్యాలయంలో ప్రతి మంగళవారం జరిగే మొబైల్ కోర్టును భాగంగా మున్సిపల్ కార్పొరేషన్ కోర్టు న్యాయమూర్తి రామమోహన్ మంగళవారం నిర్వహించారు. సర్కిల్–1 కార్యాలయ పరిధిలో మున్సిపల్ కార్పొరేషన్ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై వివిధ డివిజన్ల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నమోదు చేసిన 40 కేసులకు సంబంధించిన వారిని న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. ఆయా కేసుల్లో ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్న వ్యక్తులు, పశువులను రోడ్లపైకి వదిలివేసే వారు, రోడ్లపై చెత్త వేసేవారికి న్యాయమూర్తి రూ.20,510 జరిమానా విధించారు. నిబంధనలకు విరుద్ధంగా మరోసారి వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలను అమలు చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, శానిటరీ సూపర్ వైజర్లు ఓబేశ్వరరావు, శివరామప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దాసాంజనేయునికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక దాసాంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం సిందూరం, ఆకు పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది.